# ఒక సీరియస్ కథ

మూలం కర్ట్ టుహోల్స్కీ · స్వేచ్ఛానువాదం ఎమ్. పార్థసారథి

సుబ్బారావు హాస్య రచయిత. అతడి కథల్లో హాస్యరసం ఎంత ఎక్కువగా వుంటుందంటే రాసేటప్పుడు బలవంతంగా వచ్చే నవ్వును ఆపుకోలేక అతడి కడుపుబ్బి పోతూవుంటుంది. అతడి కథలు చదివి నవ్వని పాఠకుడులేడు. జనానికి నవ్వటం యిష్టం గనక అతను అశేష జనాదరణ పొందిన రచయిత కావటానికి ఎంతో కాలం పట్టలేదు.

కాని ఒక రోజున సుబ్బారావు తననూ తన పాఠకులనూ నవ్వులపాలు చేసుకోవటం యిష్టంలేక ఒక బ్రహ్మాండమైన సీరియస్ కథ రాయాలని నిర్ణయించుకున్నాడు. తీరా రాయటానికి కూర్చునే సరికి అదంత తేలికైన విషయం కాదని తెలిసిపోయింది. హాస్య రసానికి అలవాటు పడిన అతడి కలం మరే రసాన్నీ కాగితం మీద కక్కలేక పోయింది. చివరికి బజారు కెళ్ళి కొత్త పెన్ను కొనుక్కొచ్చుకుంటే తప్ప అతనికి సమస్య తీరలేదు.

నెల రోజులు ఏకబిగిన, నిర్విరామంగా గంభీర ముద్రలో కూర్చుని రోజుకు రెండు వాక్యాల చొప్పున రాసి ఒక గంభీరమైన కథ ముగించాడు సుబ్బారావు. ఆశయ సిద్ధిని సాధించి అలవాటు ప్రకారం తన మిత్రబృందానికి కథను చదివి వినిపించాడు. మిత్రా చదువుతుంటే తన రచన సమగ్ర స్వరూపం తనకు మొదటి సారిగా కన్పించి నట్టుగా వుంటుంది సుబ్బారావుకు. ముక్కలు ముక్కలుగా రాసిన తన కథ యితివృత్తం యిప్పుడతనికి సంపూర్ణంగా దర్శన మిచ్చింది.

హాస్యానికి అలవాటు పడిన శ్రోతలకి ఆశాభంగం కలిగిస్తున్నాననే భయంతో మొదట బెరుకు బెరుకుగా ప్రారంభించాడు గాని త్వరలోనే యితివృత్తంలో మునిగి పోయాడు. కంఠస్వరం హెచ్చింది. కాంక పోతే ఈ పఠనా కార్యక్రమంలో మధ్య మధ్య అంతరాయం కల్గించే శ్రోతల నవ్వులు ఈసారి వినిపించలేదు. గదినిండా నిశ్శబ్దం ఆవరించింది. శ్రోతలు తనను వింటున్నారా లేదా అని ప్రతిక్షణం ఓర కంట వాళ్ళను కనిపెడుతుండే దురలవాటు సుబ్బారావుకులేదు. కాని కథ మధ్యలో ఓసారి కళ్ళెత్తి తన మిత్రులవైపు చూసే సరికి ఇద్దరు నిద్రపోతున్నారు. మనసు చివుక్కుమన్నా సుబ్బారావు—పఠనమాప లేదు. తప్పెవరిది? గుర్రుపెడుతున్న శ్రోతలదా? కథదా? లేదా తను చదివే పద్ధతి అంతగా జోల పాడుతున్నట్టున్నదా? సరే, ఏ కారణమైతేనేం! మరికాసేపటికి సుబ్బారావు కూడా విసుగొచ్చింది. గొంతు నొప్పెట్టినట్టుగా తోచింది. ఒక సుదీర్ఘమైన వాక్యం చదువుతూ మధ్యలో తనూ గురక మొదలెట్టాడు. కాగితాల బొత్తుకూడా నిద్రముందుకొచ్చి అతని చేతుల్లో నించోలేక నేలమీద వాలిపోయింది.

అలాగ, ఆ గదిలోని జనమంతా తెల్లా

రిందాకా పుస్తకాల్లా పడుకున్నారంటే మీరు నమ్మలేక పోవచ్చు గాని నిజమంతే నండి; ఆ శ్రోతలకు మళ్ళీ తెలివి వచ్చేసరికి



బారెడు ప్రొద్దెక్కింది. అతి నిశితమైన విమర్శనాగరిమ కలిగిన ఆ శ్రోతలు ఆ కథాప్రాముఖ్యాన్ని యిట్టే పసికట్టారు. ఏ పాఠకుణ్ణి/శ్రోతనైనా నిద్రాదేవికి బానిస చెయ్యగలిగిన అనన్యసామాన్యమైన, అప్రతిహతమైన, అజేయమైన, అనుపమానమైన శక్తి ఆ కథలో వుందని ఏకగ్రీవంగా తీర్మానించారు. మానవ జాతికి యింత కన్నా గొప్ప వరమింకేం కావాలి? నెల తిరిగేలోగా సుబ్బారావు (రాసిన) కథ అచ్చయింది. ఎన్ని ముద్రణలైనా యో

తెలియదుగాని ఎప్పుడడిగినా పుస్తకాల షాపులవాళ్ళు "కాపీలైపోయాయండి." అంటూనే వుంటున్నారు.

ఎవరి మంచం మీద చూసినా ఈపుస్తకమే కనిపించేది ఎవరికన్నా ఈ కథ చదివి వినిపించాలంటే, పాఠకుడు కూడా ముందరే పక్క సరిచేసుకొని, పడుకొని గాని చదవటం ప్రారంభించే వాడుగాదు.

మానవ కళ్యాణానికి మహోపకారం చేసిన మహాస్రష్టగా మానవజాతి సుబ్బారావుకు ఎంత ఋణపడి వుందో మీరూహించుకోవచ్చు. అతడికి జరిగిన సన్మానాలు, అతడు సంపాదించిన డబ్బు....సరేలెండి, ఎవరికి తెలుసు ఆలెక్కలన్నీ.

ఐతే ఒక చిత్రమైన విషయం మాత్రం యింకా తేలలేదు. కథ ముగింపేమిటో ఎవరికీ యింతవరకూ తెలియదు. చివరిపేజీ దాకా చదివిన పాఠకుడెవరూ యింత వరకూ పుట్టలేదు. మామూలు మనుషులందరూ ప్రారంభంతోనే బొబ్బైపోయే వాళ్ళు. నిద్రపట్టక బాధపడే కొద్దిమంది జబ్బు మనుషులు మరో నాలుగు పేజీలు చదవగలిగేవాళ్లు. ఇంకా మొండిఘటాలు మహాఐతే మరో రెండు మూడు పేజీలు.... జగమొండిగాళ్ళు సగందాకా.... అంతే.

కొందరు తుంటరిగాళ్ళు తాము ముగింపు చదివేశావని చంకలు గుద్దుకోవటానికి ప్రయత్నించారుగాని, నిద్రలేచాక వాళ్ళకు చదివింది ఒక అక్షరమన్నా జ్ఞాపకం వుంటే ఒట్టు.

అందువల్ల ముగింపు గురించిన అనేక అభిప్రాయ భేదాలు యింకా అపరిష్కృతంగానే వున్నాయి. ✱

100 ml బాటిలు కొని

87 పైసలు ఆదా చేసుకోండి

'త్రివేణి' ఇంకు

ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.




తయారు చేయువారు :

కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ
751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081